క్లుప్తంగా

సెయింట్ ఆన్స్ కళాశాలకు రెడ్‌క్రాస్ సొసైటీ గుర్తింపు



గుంటూరు రూరల్: యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించిన తమ కళాశాలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ కళాశాలగా గుర్తించి అవార్డును అందజేయటం సంతోషంగా ఉందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. ఆదివారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రెడ్ క్రాస్ సొసైటీ అవార్డ్స్ కార్యక్రమంలో తమ కళాశాలను ఉత్తమ కళాశాలగా గుర్తించి అవార్డును అందజేశారన్నారు. అవార్డును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా కళాశాల అధ్యాపకులు బి జూయిస్, ఆదిలక్ష్మి అందుకున్నారన్నారు. సమాజ సేవ కార్యక్రమాలు, బ్లడ్ క్యాంప్‌లు, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఎంతో మేలు చేస్తున్నట్లు వివరించారు.

షుగరు వ్యాధిపై వైద్యశిబిరం



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ భవనంలో ఉచిత షుగరు వ్యాధి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఆ ప్రకారం జరిపిన శిబిరంలో దూరప్రాంతాల్నుంచి వచ్చిన రోగులకు బీపీ, షుగరు పరీక్షలు చేశారు. సొసైటీ వారు అందించిన అల్పాహారం తీసుకున్న తదుపరి మరోసారి పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. మందులు వేసుకోవడంతోపాటు ఆహార వ్యాయామ నియమాలను నిబద్ధతతో పాటించాలని ఈ సందర్భంగా డాక్టర్ శారద రోగులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలు, క్లినిక్స్‌లోని సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సలహానిచ్చారు. ప్రైవేటు హాస్పటల్స్ ఖర్చులు తగ్గించుకోవాలని చెప్పారు. ప్రాథమిక వైద్యసలహాల కోసం తమను ఏరోజైనా సంప్రదించవచ్చని చెప్పారు. ఆరోగ్య సేవల్లో పేదలు నిరాదరణకు గురికాకుండా ఉండాలన్నదే తమ అభిమతంగా చెప్పారు. 200 మంది రోగులకు పరీక్షలు చేయగా, 20 మంది వలంటీర్లు సహకరించారు.

పంచారామాలకు తెనాలి నుంచి ప్రత్యేక బస్సులు

తెనాలిఅర్బన్: కార్తికమాసం సందర్భంగా ప్రతి శని, ఆదివారాల్లో తెనాలి డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఆదివారం తెలిపారు. పంచారామలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి పుణ్యక్షేత్రాలను ఒక రోజులోనే దర్శించుకుని తెనాలి చేరుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సు టిక్కెటు ధర రూ.1270, లగ్జరీ బస్సుకు రూ.1200 చార్జీగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అదే విధంగా తెనాలి డిపో నుంచి త్రి శైవక్షేత్రాల దర్శిని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. త్రి శైవ దర్శనంలో యాగంటి, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలను దర్శించుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. త్రి శైవ క్షేత్రాల దర్శిని భక్తులు కోరినమీదట మాత్రమే బస్సు సర్వీసు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శబరిమలై, అరుణాచలానికి అద్దె ప్రాతిపదికన సరసమైన ధరలకు నూతన సూపర్‌లగ్జరీ బస్సులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 73828 92492లో సంప్రదించాలని సూచించారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, యశ్వంత్

లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, యశ్వంత్ ఎన్నికయ్యారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్య విధానం వలన అనేక మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారుగా 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీవో నంబర్ 77 వలన ఉన్నత పీజీ విద్యకు దూరమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ జీఓ నంబర్ 77 ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మీద నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో ప్రభుత్వ ఇంటర్మీడియెట్, ఒకేషనల్, డిగ్రీ కళాశాలలను నిర్మించాలని కోరారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, బి.యశ్వంత్, 11 మంది ఆఫీస్ బ్యారియర్స్, సమితి సభ్యులుగా 29 మందిని ఎన్నుకోవడం అభినందనీయం అన్నారు.

దీపావళి పండుగకు వేళాయే..

- బాణసంచా కాల్చే సమయంలో జరభద్రం..
- అనుమతులు తప్పనిసరి అంటున్న అధికారులు


బాణసంచా దుకాణం

పొన్నూరు: కుటుంబమంతా సందడిగా జరుపుకొనే దీపావళి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బాణసంచా కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. బాణసంచా అమ్మకాలకు అనుమతుల నుంచి ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పూర్తిచేశాయి. ఆనందాన్ని పంచే బాణసంచా విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలతో పాటు దుకాణ దారులూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరుతున్నారు. బాణసంచా కాల్చడం సరదాగానే ఉంటుంది. ఎంతో ఆనందాన్ని పంచిపెడుతుంది. అయితే జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు కొన్ని నిర్దిష్టమైన నిబంధనలను విధించింది. చిన్న చిన్న జాగ్రత్తలు పెద్ద పెద్ద ప్రమాదాలను నివారిస్తాయని, అంతే కాదు ఎనలేని ఆనందాన్ని అందిస్తాయని సూచించింది.

వ్యాపారులు పాటించాల్సిన నిబంధనలివే...:

- బాణసంచా విక్రయించే దుకాణాల వద్ద అగ్నిమాపక శకటం తిరిగేందుకు అనుకూలంగా ఉండాలి.
- గోదాముల్లో సామర్థ్యాన్ని మించి సామగ్రి నిల్వ ఉంచకూడదు.
- ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలి. మండే, పేలుడు పదార్థాలు, అగ్గిపెట్టెలను దుకాణాల సమీపంలో ఉంచకూడదు.
- సిగరెట్ తాగే వారిని దుకాణాల వద్దకు అనుమతించకూడదు.

దుకాణానికి అనుమతి ఉండాల్సిందే...

పట్టణంలోని ఆలయ ప్రాంగణంలో సంబంధించి అధికారులు బాణసంచా రిటైల్ అమ్మకాలకు అనుమతులు ఇస్తూ వ్యాపారులకు తగిన సూచనలు చేస్తున్నారు. బాణసంచా విక్రయ దుకాణం ఏర్పాటు చేయాలన్నా, సామగ్రి నిల్వ ఉంచాలన్నా అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల అనుమతులు తీసుకోవాలి. ఊరికి దూరంగా, ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతంలో దుకాణాలు పెట్టాలి. పండుగ మూడు రోజుల ముందు అనుమతులు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- పిల్లలు సర్వసాధారణంగా కాల్చే కాకర పువ్వొత్తులు, పెన్సిళ్లు వంటి బాణసంచా విషయంలో అజాగ్రత్త వలన చేతులు కాలవచ్చు. పెద్దలు పిల్లలను అంటి పెట్టుకొని ఉండాలి.
- టపాకాయలను ఇంటిబయట ఆవరణలో, మైదానాల్లో మాత్రమే కాల్చాలి.
- తారాజువ్వల వంటి టపాకాయలను ఇండ్లు, భవనాలు, గుడిసెలు, గడ్డివాములు లేని ప్రదేశాల్లో కాల్చాలి.
- చిచ్చుబుడ్లు, ఆటంబాంబులు, తారాజువ్వలు, సీమటపాకాయలను చేతులతో పట్టుకుని కాల్చడం ప్రమాదకరం.
- మతాబులు, కాకరపువ్వొత్తులు, విష్ణుచక్రాలు, భూచక్రాల వంటి టపాకాయలను శరీరానికి దూరంగా ఉంచి కాల్చడం మంచిది.
- టపాకాయలు విక్రయించే దుకాణాల దరిదాపుల్లో బాణసంచాను కాల్చడం మరీ ప్రమాదకరం.
- పెద్దరకం టపాకాయలను కాల్చేటప్పుడు వాటిని గాలిలో గిరగిరా తిప్పడం, పైకి విసరడం గాని, చేయరాదు. అలాచేస్తే కాల్చేవారితోపాటు సమీపంలో నిల్చున్నవారి దుస్తులు కాలి ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.
- బాంబులు, రాకెట్లు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు, విష్ణుచక్రాలు వంటి టపాకాయలు కాలే సమయంలో వాటి వత్తులు ఆరిపోతే వాటి దగ్గరగా వెళ్లి పరీక్షించరాదు.
- కాకర పువ్వొత్తులు కాల్చిన తరువాత వాటి కడ్డీలను ఇష్టం వచ్చినట్లు రోడ్లపై విసిరేయగాదు.(కుప్పగా పోసి ఆ తరువాత తీసివేయాలి)
- తారాజువ్వలు(రాకెట్లు) కాల్చేటప్పుడు వాటిని సీసాలలో పెట్టి నిటారుగా ఉండేలా సరిచూసుకుని కాల్చాలి. ఈ విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా తారాజువ్వలు ఇళ్లపైకి, ఇళ్లలోనికి దూసుకుపోగలవు.
- బాణసంచాను పెట్రోల్ బంకులకు దూరంగా కాల్చాలి.
- టపాకాయల మీదికి వంగి కాల్చకూడదు. నేల మీదవాటిని పెట్టి ఒకపక్కగా నిల్చుని కాల్చాలి.
- వదులుగా ఉండే దుస్తులను, వేలాడే దుస్తులను ధరించరాదు. కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి.
- బాణసంచా కాల్చేటప్పుడు పాదాలకు రక్షణగా చెప్పులు, కళ్లకు రక్షణగా కళ్లజోళ్లు ధరించాలి.
- వృద్ధులు, మహిళలు, రోగులు, వికలాంగులకు దూరంగా టపాకాయలను కాల్చడం మంచిది.

దుకాణాల వద్ద అవుట్ పోస్టు ఏర్పాటు



అనుకోకుండా జరిగే ప్రమాదాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం 6 దుకాణాలకు మాత్రమే అనుమతులు ఇచ్చాం. దుకాణ సముదాయాల్లో ప్రత్యేకంగా అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తున్నాం. బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించేలా తప్పనిసరిగా చెప్పులు వేసుకోవడంతో పాటు ముఖానికి మాస్క్ ధరించేలా చూడాలి. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే 08643- 242211 నంబరుకు సమాచారం అందించాలి.

–ప్రసాదరావు, అగ్నిమాపక శాఖ అధికారి, పొన్నూరు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు


మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

పొన్నూరు: పట్టణంలోని 31 వార్డులు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజారోగ్య సిబ్బందిపై ఉందని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని 24వ వార్డులో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. మురుగు కాలువలలో నీరు నిల్వ చేరకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. రోడ్ల వెంబడి చెత్త, వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పవిత్ర కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని శివాలయాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పాత పొన్నూరు శివాలయం ప్రధాన అర్చకులతో చర్చించారు. కార్తిక మాస దీక్షల కొరకు భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై తగిన చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

వెనిగండ్లలో పడకేసిన పారిశుద్ధ్యం


జెడ్పీహెచ్ స్కూల్‌కు వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

- ఇష్టారాజ్యంగా కార్మికుల తొలగింపు
- కళ్యాణ మండపం నిర్వహణపై విమర్శలు

పెదకాకాని: పారిశుద్ధ్యం పడకేసింది. రోడ్ల వెంట దుర్గంధం వెదజల్లుతోంది. వెనిగండ్లలో పదిరోజులుగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. పంచాయతీ కార్యాలయం నుంచి హైస్కూల్‌కు నిత్యం వేలాదిగా ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ మార్గం గుండానే పాఠశాలకు వెళ్తుంటారు. గ్రామంలో చెత్త ఇక్కడ వెయ్యరాదని పంచాయతీ అధికారులు బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ చెత్త మాత్రం అక్కడే వేస్తున్నారు. నాలుగేళ్లుగా పనిచేస్తున్న చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్ ఆళ్ల రాఘవరెడ్డి, పంచాయతీ గుమస్తా అక్రమంగా వెయ్యి రూపాయలు వసూలు చేయడంపై ప్రశ్నించడంతో ఆగ్రహించిన ఆయన డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించారు. టెండర్ పోస్టులకు గడువు మార్చి నెల వరకూ ఉన్నప్పటికీ పంచాయతీ బోర్డు సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేసి మరీ విధుల నుంచి తప్పించారు. చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగుతున్నడనే ఆరోపణతో తొలగించడంతో అక్రమ తొలగింపుపై బాధితుడు జిల్లా పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో మైత్రి కళ్యాణ మండపం పంచాయతీ పర్యవేక్షణలో కొనసాగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి హరిబాబు గతంలో పనిచేస్తున్న ఎలక్ట్రీషన్‌ను తొలగించి కొత్త ఎలక్ట్రీషన్‌ను ఏర్పాటు చేశారు.

కళ్యాణమండపంలో వివాహాలు చేసుకునే వారు పంచాయతీ వారు చెప్పిన ఎలక్ట్రీషియన్ ద్వారా మాత్రమే లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని కొత్తరూలు అమలులోకి తెచ్చారు. పంచాయతీ పర్యవేక్షణలో కొనసాగుతున్న కళ్యాణ మండపానికి లైటింగ్, డెకరేషన్ చేసేవారిని టెండర్ ద్వారా నియమించడం ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచుకోవచ్చని గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

బందెలదొడ్డిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ బందెలదొడ్డిలో ఆవులకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం వెంగళాయపాలెంలోని బందెలదొడ్డిని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రోడ్ల మీద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆవులు, ఎద్దులు, పశువులను ఇక్కడకు తరలిస్తున్నామన్నారు. ఆవులను శుభ్రం చేయడానికి, నీరు బయటకు వెళ్లడానికి వీలుగా ప్లాట్ ఫారం, అదనపు షెడ్‌ని ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. అలాగే మేతకి వినియోగించే గడ్డి తడవకుండా కూడా షెడ్ వేయాలన్నారు. ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది వివరాలను తమకు అందించాలని, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవులను సదరు యజమానులు కావాలని అడిగినప్పుడు, వారికి అప్పగించడానికి నిర్దేశిత ఫైన్, డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని కోరారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఆనందకుమార్, టీపీఎస్ లక్ష్మణ స్వామి, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై నగర పాలక సంస్థ చర్యలు


అనుమతులు లేని లే అవుట్‌లో పొక్లెయిన్‌తో రాళ్లు, రోడ్లు తొలగిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార వెంచర్లు, లే అవుట్లు ఉండడానికి వీలు లేదని, అటువంటి వాటిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగిస్తామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు ఆర్టీఓ ఆఫీస్‌రోడ్, సీతయ్యడొంక రోడ్లలోని అనధికార లే అవుట్స్‌లో ఏర్పాటు చేసిన హద్దు రాళ్లు, బోర్డులు, రోడ్లను మూడు పొక్లెయిన్‌లతో పూర్తి స్థాయిలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలో దరఖాస్తు చేసినలే అవుట్స్‌కి నిర్దేశిత గడువులోగా తగిన అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. అనధికార వెంచర్లలో ప్లాట్‌లు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో జీఎంసీ నుంచి అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుకావడం లేదని, ఫలితంగా మౌలిక వసతులు లేక ప్లాట్‌ల కొనుగోలుదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హెచ్చరించారు. ఇప్పటికే పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి ల్యాండ్ టైటిల్ వివాదాలపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. నగర పాలక సంస్థ నుంచి లే అవుట్స్ అనుమతి పొందిన ప్లాట్ విక్రయదారులు లే అవుట్స్ అనుమతి వివరాలతో సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాట్ కొనుగోలుదారులు ముందుగానే సదరు లే అవుట్స్‌కు నగర పాలక సంస్థ అనుమతులు ఉన్నది లేనిదీ పూర్తి వివరాలు తెలుసుకొని కొనుగోలు చేయాలని కోరారు. అనధికార లే అవుట్స్‌ల రిజిస్ట్రేషన్ నిలుపుదలపై జిల్లా రిజిస్ట్రార్‌కి లేఖ పంపుతామని వెల్లడించారు. నగర పరిధిలో గుర్తించిన 40 అనధికార లే అవుట్స్‌కు ఇప్పటికే నోటీసులు జారి చేశామన్నారు. ఆదివారం నుంచి స్పెషల్ డ్రైవ్ మోడ్‌లో తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అనుమతులు లేని లే అవుట్స్‌లో చేపట్టిన రోడ్లు, హద్దు రాళ్లను తొలగిస్తామని ఆయా లే అవుట్స్ యజమానులు తప్పనిసరిగా జీఎంసీ నుంచి తగిన అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు అభినందనీయం

గుంటూరు మెడికల్: గుంటూరు కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ అధికారులు, బ్యాంకు అధికారులు ఐక్యంగా కృషి చేసి గుంటూరు పట్టణంలో చిరు వ్యాపారులకు ఆర్థిక రుణం అందించడం ద్వారా జాతీయస్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వానిధి పథకం కింద చిరు వ్యాపారులు అధిక వడ్డీలకు అప్పులు చేసి బాధలు పడుతున్న విధానం నుంచి రక్షించడం కోసం కేంద్ర ప్రభుత్వం స్వానిధి పథకం ప్రవేశపెట్టిందన్నారు.


మురుగునీటిలో పెరుగుతున్న దోమలదండు


తిక్కిరెడ్డిపాలెం వెళ్లే మార్గంలో నడిరోడ్డుపై నిలిచిన మురుగునీరు


పూడిపోయిన సైడు కాలువలు

పారిశుద్ధ్యమా నీ జాడెక్కడ..

ప్రత్తిపాడు: స్వచ్ఛతా హీ సేవ అన్నారు.. శ్రమదానమన్నారు.. పరిసరాల పరిశుభ్రత పాటిద్దామన్నారు. కానీ ఇవన్నీ క్యాప్షన్‌లకు, ప్లకార్డులకు, స్లోగన్లకే పరిమితమయ్యాయి. కట్ చేస్తే ఇదిగో వాస్తవ పరిస్థితులు ఇలా కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని యనమదలలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తుండటంతో కాలువలు గడ్డిమొక్కలతో పెరిగి, మురుగు నీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. దోమలు, దోమల లార్వా విపరీతంగా పెరుగుతున్నాయి. రోడ్డు పక్కనే నెయ్యి డిబ్బాలు, పశువుల మలమూత్రాలు దర్శనమిస్తూ పారిశుద్ధ్యం క్షీణించి కనిపిస్తుంది.

అప్పులు తీర్చలేక..

పురుగుమందు తాగి కౌలురైతు బలవన్మరణం


యనగందుల వీరారావు(ఫైల్)

ప్రత్తిపాడు: వ్యవసాయానికి తీసుకున్న అప్పులు తీర్చలేక.. అప్పులిచ్చిన వారికి ముఖం చూపించలేక ఓ కౌలు రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. ప్రత్తిపాడుకు చెందిన యనగందుల వీరారావు(54) సొంత భూమి లేదు. ప్రతి ఏటా భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటాడు. రెండేళ్లగా పెదగొట్టిపాడులో ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేశాడు. పంటకు తెగుళ్లు సోకడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో పంటను కోల్డ్‌స్టోరేజీలో నిల్వచేశాడు. దీంతో వ్యవసాయానికి అయిన అప్పులు తీర్చేందుకు ఉన్న సొంత ఇంటిని అమ్ముకుని కొంతమేర అప్పులు తీర్చాడు. సొంత భూమి లేకపోవడంతో ఈ ఏడాది సాగు చేయలేదు. అప్పులన్నీ కలిపి సుమారు రూ.6.89 లక్షల వరకూ ఉన్నాయి. బాకీలు ఇవ్వవలసిన వారికి కోల్డ్‌స్టోరేజీలో ఉన్న మిర్చిని విక్రయించి బాకీ చెల్లిస్తానని చెబుతూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన కోల్డ్‌స్టోరేజీలో ఉన్న మిర్చిని విక్రయించాడు. ఏసీ అద్దెలు, మిర్చిపై తీసుకున్న రుణం, వడ్డీ అన్నీ కలిపి రెండు లక్షలు పోగా, చేతికి 23వ తేదీన రూ.77 వేలు మాత్రమే వచ్చాయి. చేతికొచ్చిన కొద్ది డబ్బుతో ఎవ్వరి అప్పు తీర్చాలో అర్థం కాక, అప్పులిచ్చిన వారికి ముఖం చూపించలేక అదే రోజు సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. రేకుల షెడ్డులో వాంతులు చేసుకుంటున్న సమయంలో గమనించిన స్థానికులు వీరారావును స్థానికంగా ఉన్న సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వీరారావు కన్నుమూశాడు. కుమారుడు వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

విద్యార్థులకు చదువుతోపాటు ఆధ్యాత్మికత అవసరం

తెనాలి: విద్యార్థులు చదువుతోపాటు ఆధ్యాత్మిక ఆలోచనలను అలవరచుకోవాలని, సమాజాభివృద్ధికి సహాయపడాలని ఐఐటీ, మద్రాస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎమిరిటస్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ ఎన్.రమేష్‌బాబు సూచించారు. పట్టణానికి చెందిన వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటీస్ ఏటా నిర్వహిస్తున్నట్టే ఈ ఏడాది ఉపకార వేతనాల ప్రదానోత్సవాన్ని ఆదివారం స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటుచేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు అధ్యక్షత వహించారు. 2024 సంవత్సరానికి 111 మంది విద్యార్థులకు రూ.19 లక్షల ఉపకార వేతనాలను అందజేశారు. సభలో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకుని ఇష్టంగా చదువుకుంటే రాణించగలరని చెప్పారు. విద్యాభివృద్ధికి ట్రస్ట్ ఆశయాలను అభినందించారు. అభ్యుదయ కవి డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం ఇస్తున్న ట్రస్ట్ నిర్వాహకుల కృషి గొప్పదన్నారు. విద్యార్థి దశలో కష్టపడి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెబుతూ సమాజానికి తిరిగి ఏవిధంగా సహాయపడాలనేది విద్యార్థులు ఆలోచించుకోవాలని సూచించారు. పట్టణంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపును పొందిన వడ్లమూడి కోటయ్యచౌదరి పేరుతో ట్రస్ట్‌ను నెలకొల్పి, పేద విద్యార్థులకు గత 28 ఏళ్లగా ఆర్థికసాయం అందిస్తున్నట్టు డాక్టర్ గోవర్ధనరావు గుర్తుచేశారు. ఇప్పటివరకు 450 మంది విద్యార్థులకు 1210 ఉపకార వేతనాల ద్వారా రూ.1.85 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. ట్రస్ట్ సభ్యులు వడ్లమూడి బసవప్రసాద్, వడ్లమూడి బసవారావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ వి.వెంకటనాయుడు

లక్ష్మీపురం: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా మనం తీసుకునే నీరు, వివిధ ఆహార పదార్థాల మూలంగా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడతాయని వివరించారు. మధుమేహం ఉన్న వారిలో ఈ యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువ అని ఇన్ఫెక్షన్ వచ్చిన సమయంలో చలి జ్వరం, మూత్ర విసర్జనలో మంట లాంటి లక్షణాలు కనబడతాయన్నారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన మూత్రపిండ సమస్యలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వెంకట నాయుడును ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా డాక్టర్ రమ్య, డాక్టర్ ఏ రవీంద్ర కుమార్, సీనియర్ యోగాచార్యులు ఇందు శేఖర్ పాల్గొని ప్రసంగించారు.